భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి



రైతులతో కలిసి టేకుమట్ల శివారులో పర్యటిస్తున్న పాలనాధికారి కుమార్ దీపక్

జైపూర్, న్యూస్‌టుడే : మంచిర్యాల నుంచి విజయవాడ వరకు నిర్మించతలపెట్టిన 163జీ జాతీయ రహదారి భూసేకరణ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్ అన్నారు. బుధవారం ఆర్డీవో రాములు, తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న గ్రామాలను పరిశీలించారు. 334 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ రహదారి నిర్మాణానికి జిల్లాలో 110 హెక్టార్ల భూమి అవసరం ఉందన్నారు. ఇప్పటికే 83 హెక్టార్లను అప్పగించినట్లు, అటవీ భూములకు ప్రత్యామ్నాయ భూములను గుర్తించి అనుమతుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

రక్తదానం చేసి.. స్ఫూర్తిగా నిలిచి..




ఏసీపీ ప్రకాష్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న సీపీ, డీసీపీలు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: సమాజ సేవలో పోలీసులు ఆదర్శంగా ఉండాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మంచిర్యాల పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా రక్తదానం చేయాలని సీపీ పేర్కొన్నారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌కుమార్‌లు రక్తాన్ని దానం చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన పోలీసులు, ఆటోడ్రైవర్లు, యువకులకు ప్రశంసాపత్రాలను అందించారు. డీసీపీ భాస్కర్, పోలీసులు అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధుల పాల్గొన్నారు.

నమ్మిన వాడే నయవంచకుడు..

- యువతులు, మహిళలపై పంజా



'జిల్లాలో ఉపాధి అవకాశాల పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. తర్వాత వారిని మచ్చిక చేసుకొని వ్యభిచారం చేయించారు. ఇటీవల పోలీసులకు పట్టుబడ్డారు.'

జిల్లాలో గడిచిన రెండు నెలల్లో నమోదైన వ్యభిచారం కేసులు : 05

బాధిత మహిళలు: 21

'జిల్లా కేంద్రంలో ఓ షార్ట్ ఫిల్మ్ నిర్వాహకులు కళాకారులు కావాలనే ప్రకటనతో యువతులు వారిని ఆశ్రయిస్తున్నారు. షూటింగ్‌కు కొద్ది రోజులు పడుతుందని తాము చెప్పినట్లు వింటే డబ్బులు ఇస్తామంటూ ఆశ చూపి వారిని వ్యభిచారంలోకి దింపారు.'

తెలిసీ తెలియని వయసు.. మంచీ చెడులను అర్థం చేసుకోలేని మనసు. ఆప్యాయంగా పలకరించే వారంతా ఆత్మీయులుగా భావిస్తారు. వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని యువకులు, మధ్య వయస్కులు బాలికలను, యువతులను, మహిళలను వంచిస్తున్నారు. నమ్మకంతో వచ్చిన వారిని వ్యభిచారం రొంపిలోకి లాగుతున్నారు. కొంతమంది మహిళలు ఆర్థిక ఇబ్బందులతో ఈ కూపంలోకి వస్తుండగా.. యువతులు ఉపాధి కోసం, లఘుచిత్రం(షార్ట్ ఫిల్మ్)లలో అవకాశాల కోసం వస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జిల్లాలో లాడ్జిలు, ఇతర ప్రాంతాల్లో వ్యభిచారం కేసుల్లో పలువురు పట్టుబడ్డారు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించగా పలు విషయాలు వెల్లడయ్యాయి.

న్యూస్‌టుడే, మంచిర్యాల నేరవిభాగం

జైపూర్ మండలానికి చెందిన ఓ యువతి ఓ ఆటోడ్రైవర్‌తో ప్రేమలో పడింది. ఇల్లు విడిచి అతడితో వెళ్లింది. కొద్దిరోజులు అతడు ఆమెను శారీరకంగా వాడుకొని వదిలేశాడు. తర్వాత ఆమె దారితప్పింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సైకియాట్రిస్టు దగ్గరికి తీసుకెళ్లగా ఆమె తప్పును తెలుసుకునే పరిస్థితిలో లేదు. తాను సంపాదిస్తున్న డబ్బుపైనే ఆమె మమకారం చూపింది.

ఇటీవల జిల్లా కేంద్రంలో ఓ యువతి తన ప్రియుడు విందు చేసుకుందామని ఓ లాడ్జికి పిలిచాడు. పోలీసులు దాడి చేయగా ఆమె ప్రియుడితో పట్టుబడింది. సఖీ కేంద్రం నిర్వాహకులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

◆ జిల్లా కేంద్రంలో వివిధ సంస్థల్లో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి యువతులు, మహిళలు ఉపాధి కోసం పనిచేస్తున్నారు. వీరి అవసరాన్ని ఆసరాగా తీసుకుంటున్న దుకాణంలోని కొందరు ప్రబుద్ధులు వారిని శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇంట్లో చెప్పుకొంటే ఉన్న ఉపాధి ఎక్కడ పోతుందోనన్న మనోవేదనకు గురవుతున్న వారు చాలామంది ఉన్నారు.

ఎందుకిలా జరుగుతుందంటే..

- పరిణితి లేని వయసు
- కుటుంబసభ్యుల కన్నా బాగా చూసుకుంటారనే భావన
- తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం
- ప్రలోభాలకు గురికావడం
- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు.. మానసిక ఒత్తిళ్లు

తల్లిదండ్రులు చెప్పాలి..

శ్రీలత, జిల్లా సఖి కేంద్రం బాధ్యురాలు



పిల్లలకు మొదటి నుంచే కాలానుగుణంగా వచ్చే హార్మోన్ల మార్పు, ఆకర్షణలు వారిపై ఎలాంటి ప్రభావం చూపుతాయో తల్లిదండ్రులు వివరించాలి. ప్రేమ వలలో చిక్కి మోసపోయిన యువతులను శత్రువులుగా చూడకుండా వారిని సాధారణ జీవనం వైపు అడుగులు వేసేలా తోడ్పాటు అందించాలి. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారు వ్యభిచారం వైపు వెళ్లకుండా ప్రత్యామ్నాయంగా అనేక మార్గాలు ఉన్నాయని చెబుతున్నాం. పని చేసే చోట ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెబుతున్నాం.

డొక్కు బస్సులే దిక్కు!

- ఆర్టీసీలో సగం అద్దె వాహనాలే
- నిర్వహణ లేక తరచూ మొరాయింపు

ఈటీవీ – ఆదిలాబాద్

ఆదిలాబాద్ రీజియన్ ఆరు డిపోల పరిధిలో 620 బస్సులుంటే 311 అద్దెవి ఉన్నాయి. 309 సంస్థ బస్సులున్నాయి. ఆర్టీఏ నియమావళి ప్రకారం 15 ఏళ్లు దాటినా.. 13 లక్షల కిలోమీటర్ల వరకు తిరిగిన బస్సులను వినియోగించరాదనే నిబంధనలు ఆర్టీసీలో అమలు కావటం లేదు. రీజియన్ పరిధిలో 16 లక్షల కిలోమీటర్ల దాటిన 70 బస్సులను ఇంకా తిప్పుతూనే ఉన్నారంటే జిల్లాకు ఆ సంస్థ ఇస్తున్న ప్రాధాన్యం వెల్లడవుతోంది. ఇందులో నిర్ణీత గడువు ముగిసిన 30 నుంచి 40 బస్సులను స్క్రాప్‌కు పంపించాల్సి ఉన్నా సరిపడా కొత్త బస్సుల్లేక పాత వాటినే ఏదో రకంగా వినియోగించుకోవాల్సి వస్తోంది. అద్దె బస్సుల పరిస్థితిని చూసేవారేలేరు.



భైంసాలో మంగళవారం రాత్రి మహిళా కండక్టరు సెల్ ఫోన్ వెలుతురులో మరమ్మతులు చేస్తున్న డ్రైవర్, మెకానిక్

భైంసా డిపోలో 32 బస్సుల్లో 30 పాతవే

భైంసా: భైంసా డిపో పరిధిలోని బస్సులన్నీ పాతవే కావడంతో తరచూ మొరాయిస్తున్నాయి. డిపోలో సంస్థ బస్సులు 32 ఉండగా, వాటిలో 30 పాతవే. 47 అద్దె బస్సుల్లో కొన్నింటి పరిస్థితి అలాగే ఉంది. వాటి నిర్వహణ బాధ్యత సంబంధిత యాజమాన్యాలదే అయినా, వాటిని ప్రతిరోజు పరిశీలించి బస్టాండుకు పంపాల్సిన బాధ్యత డిపో అధికారులదే. తాజాగా ఎడ్‌బిడ్ సర్వీసు అద్దె బస్సు ఒకరోజు మూడుసార్లు మొరాయించింది. మంగళవారం రాత్రి సైతం భైంసా బస్టాండు దాటకుండానే సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. మెకానిక్‌లు వచ్చి మరమ్మతులు చేశారు. సాయంత్రం 6 వరకే విధులు నిర్వహించాల్సిన మహిళా కండక్టరు రాత్రి 9:30 గంటలకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి ఇంటికి వెళ్లాల్సి వచ్చింది.

ఉమ్మడి జిల్లాలోని బస్సుల వివరాలు..

■ ఆర్టీసీ ■ అద్దె

రకం	ఆర్టీసీ	అద్దె
రాజధాని	08	--
లహరి(ఏసీ)	12	--
లహరి(నాన్‌ఏసీ)	14	--
సూపర్ లగ్జరీ	88	--
డీలక్స్	03	--
సెమీ డీలక్స్	04	--
ఎక్స్‌ప్రెస్	33	75
పల్లె వెలుగు	149	234



ఎక్కడపడితే అక్కడే ఆగిపోతూ..

ఆదిలాబాద్ బస్టాండు నుంచి బయలుదేరిన అయిదు నిమిషాలకే కొద్ది దూరంలోనే ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. బస్సు నిండా ప్రయాణికులు ఉన్నారు. వారంతా తిరిగి కాలినడకన అవస్థలు పడుతూ బస్టాండ్‌కు మరో బస్సు కోసం వెళ్లారు. నిజామాబాద్‌కు వెళ్లాల్సిన ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సు మంగళవారం మరమ్మతులతో ఒక్కసారిగా ఆగిపోయింది. నిత్యం ఇలాగే జరుగుతున్నా పట్టింపు కరవైంది.

కొత్తవి రావడం లేదు



మంచిర్యాల డిపో పరిధిలో డొక్కు బస్సులు చాలానే ఉన్నాయి. ప్రయాణానికి అసలు పనికిరాని మూడు బస్సులను గుర్తించిన అధికారులు కరీంనగర్‌లోని సంస్థ స్క్రాప్ షెడ్డుకు పంపించాలని పక్కనపెట్టారు. వాటిస్థానంలో ఒకటే కొత్త బస్సును కేటాయించారు. ఈ దుస్థితి కేవలం మంచిర్యాల డిపోకే పరిమితం కాలేదు. ఆసిఫాబాద్, భైంసా డిపోల్లోనూ ఇలాగే ఉంది. కొత్తవాటిని కేటాయించడం లేదు.

అన్నింటిని పరిష్కరిస్తాం

- ప్రణీత్, డిప్యూటీ ఆర్ఎం



ఒక్కో సమస్యను పరిష్కరించే ప్రయత్నం జరుగుతోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశాం. రీజియన్ పరిధిలోని పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు సర్వీసులు తిప్పేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తాం.

నిర్మాణంలో నిర్లక్ష్యం.. పనులు ఆలస్యం

- ఆహారశుద్ధి పరిశ్రమకు శాపం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే

బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఆహారశుద్ధి పరిశ్రమ (ఫుడ్ ప్రాసెసింగ్ జోన్) పనుల్లో జాప్యం కొనసాగుతోంది. వీటిని ప్రారంభించడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. భారాస ప్రభుత్వ హయాంలో ఆహారశుద్ధి పరిశ్రమ బెల్లంపల్లికి మంజూరైంది. దీని కోసం కన్నాల శివారులో 355 ఎకరాలను సేకరించి పనులు ప్రారంభించారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ కోసం ప్రత్యేకంగా సబ్ స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. రోడ్లు, విద్యుత్తు స్తంభాల ఏర్పాటు పనులు వేగంగా జరిగాయి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రస్తుతానికి పనుల్లో జాప్యం నెలకొంది.

ఇక్కడ 26 రకాల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇప్పటివరకు నాలుగు కంపెనీలకు 30 ఎకరాల భూమిని కేటాయించారు. అయితే ఆహారశుద్ధి పరిశ్రమ ఏర్పాటుపై అవగాహన లేకపోవడంతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. నాలుగు కంపెనీలు మాత్రమే దరఖాస్తు చేసుకోగా వీటికి మాత్రమే అనుమతి లభించింది.

నీటి సరఫరా పనులు ఆలస్యం

ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో నీరు ప్రధానం అయినా.. సరఫరా పనులు ప్రారంభం కాలేదు. భగీరథ అధికారులు ఇక్కడ సర్వే కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పరిశ్రమలశాఖ నీటి సరఫరాకు ప్రతిపాదనలు పంపింది. రోడ్లు, విద్యుత్తు నిర్మాణ పనులకు రూ.46 కోట్లను ఖర్చు చేస్తున్నారు. ఇక్కడ సింగరేణి, ప్రభుత్వ విద్యుత్తు స్తంభాలు తొలగించకపోవడంతో రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు. విద్యుత్తు సరఫరాకు ప్రత్యేకంగా సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారు. ఇది పూర్తికావడానికి అయిదు నెలలు పట్టే అవకాశం ఉంది. డ్రైనేజీల నిర్మాణానికి కాల్వలు తవ్వి వదిలేశారు.



అసంపూర్తిగా ఉన్న రోడ్డు

మట్టి అక్రమ రవాణా

ఆహారశుద్ధి పరిశ్రమ స్థలం పరిధిలో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. మట్టి రవాణాను అరికట్టడానికి ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులు కొత్తబస్టాండ్ వద్ద కందకం తవ్వారు. దీనిపై మట్టి పోసి ట్రాక్టర్లు వెళ్లేలా తయారు చేసుకున్నారు. నిత్యం రాత్రి వేళ్లలో వందల సంఖ్యలో మట్టి ట్రిప్పులు వెళుతున్నాయి. గతంలో లారీల్లోనూ మట్టిని హైదరాబాద్‌కు తరలించిన సందర్భాలున్నాయి. పనులు నెమ్మదిగా కొనసాగుతుండటంతో పరిశ్రమలశాఖ అధికారులు ఇటువైపు రావడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని మట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు.



కొత్తబస్టాండ్ వద్ద కందకంపై పోసిన మట్టి

ఉద్యానవనం.. అధ్వానం

చిన్నారులతోపాటు పెద్దలకు ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యాన్ని పంచే చెన్నూరు పట్టణంలోని పార్కు నిర్వహణ అధ్వానంగా మారింది. చిన్నారుల ఆట పరికరాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో విద్యుద్దీపాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో చీకట్లు కమ్ముకున్నాయి. ఈ చీకట్లో చిన్నారులు ఆటలాడుతున్నారు. వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసిన జిమ్ వద్ద పరిస్థితులు అలాగే ఉన్నాయి. దీని సమీపంలో పిచ్చి మొక్కలు, గడ్డి ఏపుగా పెరుగుతున్నాయి. దీంతో పార్కుకు వచ్చేందుకు చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు.



పార్కులో జిమ్ వద్ద సక్రమంగా లేని వెలుగు



పార్కులో పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి

చెన్నూరు పట్టణం, న్యూస్‌టుడే

ఆకతాయిలు వేధిస్తే సమాచారం ఇవ్వండి

మంచిర్యాలనేరవిభాగం: మంచిర్యాల షీటీమ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రతిభ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆకతాయిల నుంచి ఎలాంటి వేధింపులు వచ్చినా డయల్ 100 లేదా 63039 23700కు సమాచారం ఇవ్వాలని సిబ్బంది శ్రావణ్, జ్యోతిలు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది తిరుపతి, రవి, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

తరలింపుతో గతి తప్పిన ప్రగతి..

- ఉట్నూరు వీడుతున్న ముఖ్యశాఖలు
- అవస్థల్లో గిరిజనులు

ఏజెన్సీ ప్రాంతాలలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ముఖ్యమైన ప్రభుత్వ శాఖలను క్రమంగా మైదాన ప్రాంతాలకు తరలించేశారు. ఇది ఏజెన్సీ గ్రామాల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అభివృద్ధి కోసం మరిన్ని శాఖలను తీసుకురావాల్సిన పాలకులు ఉన్న వాటిని తొలగించడంతో ప్రగతి కుంటుపడుతోందని గిరిజనులు వాపోతున్నారు.

న్యూస్‌టుడే, ఉట్నూరు

ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంతో ఉట్నూరులో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ తరువాత ఐటీడీఏ ఆధీనంలోని ఏజెన్సీ డివిజన్ పరిధిలోని ఉట్నూరు, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, జైనూర్, సిర్పూరు(యు), లింగాపూర్ మండలాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇక్కడి చిన్న నీటి పారుదలశాఖ, సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ), జిల్లా మలేరియా అధికారి(డీఎంవో), పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు(ఏడీ), రోడ్డు, భవనాల డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఏజెన్సీ మండలాలలో అభివృద్ధి పనులు చేపట్టేవారు. సంక్షేమ పథకాలు అమలు చేసేవారు. ప్రస్తుతం ముఖ్యమైన ఆ శాఖలను ప్రభుత్వం మైదాన ప్రాంతాలకు తరలించింది.

చిన్ననీటి పారుదల శాఖ ఆదిలాబాద్‌కు

ఏజెన్సీ ప్రాంతంలో సాగునీటి పథకాలను వినియోగంలోకి తేవాలనే లక్ష్యంతో 1980లో ఐటీడీఏ కార్యాలయం ఉట్నూరులో చిన్ననీటి పారుదలశాఖ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఈ శాఖ ఆధ్వర్యంలో ఏజెన్సీ మండలాలలోని చెరువులకు మరమ్మతులు, కొత్త చెరువుల నిర్మాణం, కుంటల తవ్వకాలు చేపట్టి రైతులకు సాగునీటి సమస్యను తీర్చేవారు. 2016లో ప్రభుత్వం నీటి పారుదల శాఖలో చేపట్టిన మార్పులతో ఉట్నూరులోని చిన్న నీటి పారుదల శాఖను మైదాన ప్రాంతమైన ఆదిలాబాద్‌కు తరలించి, నీటి పారుదల శాఖలో కలిపేసింది.

అందని వ్యవ'సాయం'

ఏజెన్సీ ప్రాంతంలోని సుమారు 50 వేలకు పైచిలుకు రైతులకు సంబంధించి 1.50 లక్షల ఎకరాలలో పండించే పంటలు, వ్యవసాయ సాగులో వచ్చే సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఉట్నూరులో ఏర్పాటు చేసిన సహాయ వ్యవసాయ సంచాలకుడి(ఏడీఏ) కార్యాలయాన్ని ప్రభుత్వం ఇచ్చోడకు తరలించింది. సహాయ వ్యవసాయ సంచాలకులు లేక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మలేరియా తగ్గేదెలా?

ఏజెన్సీ ప్రాంతంలో కాలంతోపాటు కీటక జనిత వ్యాధులు విజృంభిస్తుంటాయని గుర్తించిన ప్రభుత్వం 1980లో ఇక్కడ జిల్లా మలేరియాధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. మూడు దశాబ్దాల పాటు ఇక్కడ సేవలందించిన కార్యాలయాన్ని ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి తరలించింది. ఏజెన్సీలో మలేరియాధికారి లేక పర్యవేక్షణ కరవై మారుమూల గ్రామీణ ప్రాంతాలలో దోమలకాటుతో వచ్చే మలేరియా ఇతర వ్యాధులు పెరిగిపోయి ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది.

మరిన్ని శాఖలు..

రహదారుల నిర్మాణం కోసం ఉట్నూరులో ఏర్పాటు చేసిన రోడ్డు, భవనాల శాఖ డివిజన్ కార్యాలయాన్ని చెన్నూరుకు తరలించారు. ఆదివాసీ గిరిజనులకు సత్వర న్యాయం కోసం గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన సంచార న్యాయస్థాన వ్యవస్థను మూసేశారు. ఐటీడీఏ ఉట్నూరులో మంజూరుచేసిన ప్రత్యేక ఏజెన్సీ విద్యాధికారి పోస్టు, పట్టు పరిశ్రమల శాఖ సంచాలకుడి(ఏడీ) పోస్టును రద్దు చేశారు.



చెన్నూరు పట్టణంలోని పాత సామాజిక ఆసుపత్రి భవనం ఎదుట నిర్మించిన ప్రజా మరుగుదొడ్డి ఇది. సుమారు రూ.10 లక్షలు వెచ్చించి దీన్ని నిర్మించారు. సామాజిక ఆసుపత్రి నూతన భవన నిర్మాణ సమయంలో దీన్ని కూల్చివేశారు. తిరిగి మరోదాన్ని ఇక్కడ ఏర్పాటు చేయలేదు. దీంతో స్థానికులతోపాటు వివిధ అవసరాల కోసం పట్టణానికి వచ్చే వారికి మలమూత్ర విసర్జనకు ఇబ్బందులు తప్పడం లేదు.

అత్యవసరమైతే ఉగ్గపట్టుకోవాల్సిందే!

- పట్టణ జనాభాకు సరిపడా లేని ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు

చెన్నూరు, న్యూస్‌టుడే

చెన్నూరు పట్టణ జనాభాకు అనుగుణంగా ప్రజా మరుగుదొడ్లు లేక కాలకృత్యాలు తీర్చుకోవడం కష్టంగా మారింది. వీధి వ్యాపారులు, కూరగాయల విక్రయదారులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే వారికి అందుబాటులో ప్రజా మరుగుదొడ్లు లేక ఇబ్బందికర పరిస్థితి నెలకొంటోంది. పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లే వరకు ఒంటికి రెంటికీ సమస్యలు తప్పడం లేదు. మహిళల దుస్థితి వర్ణనాతీతంగా మారింది. దీంతో వారు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పురుషులు, మహిళల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లను నిర్మించాల్సి ఉన్నా మున్సిపాలిటీలో ఆ సదుపాయం లేదు. పట్టణంలోని కొత్తబస్టాండ్ ఆవరణలో తప్ప ఎక్కడా మరుగుదొడ్లు లేకపోవడంతో పరిస్థితి దయనీయంగా ఉంది.



పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో నిర్మించిన ప్రజా మరుగుదొడ్డి ఇది. దీన్ని రూ.10 లక్షలతో నిర్మించగా నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు వ్యక్తులు చూస్తున్నారు. ఇక్కడి రద్దీకి మరో రెండు శౌచశాలలను నిర్మించాల్సి ఉన్నా.. ఎవరూ స్పందించడం లేదు.

చెన్నూరు పట్టణ జనాభా, ప్రజా మరుగుదొడ్ల వివరాలు ఇలా..

పురపాలిక	జనాభా	ఉండాల్సినవి	ఉన్నవి (సీట్లు) (పురుషులు/స్త్రీలు)	మహిళా శౌచశాల	సంచార టాయిలెట్లు
చెన్నూరు	30,325	30	6 6	00	00


అవసరమైన చోట లేక ఇబ్బందులు

◆ స్వచ్ఛభారత్ మార్గదర్శకాల ప్రకారం పురపాలికలో ప్రతీ వెయ్యి జనాభాకు ఒక మరుగుదొడ్డి(సీటు) చొప్పున అందుబాటులో ఉండాలి.

◆ చెన్నూరు పట్టణంలో 30,325 జనాభా ఉండగా 30 సీట్లతో మరుగుదొడ్లు, అందులో స్త్రీ, పురుషులకు 50 శాతం చొప్పున ఉండాలి. అంటే ప్రధాన ప్రాంతాలను ఎంపిక చేసి మహిళలకు 5, పురుషులకు 5 చొప్పున సీట్లతో ఆరు ప్రాంతాల్లో ఇవి ఉండాలి.

◆ చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాలతోపాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వివిధ అవసరాల నిమిత్తం నిత్యం వేలాది మంది పట్టణానికి షాపింగ్‌లకు వస్తుంటారు. పురపాలికలో సరిపడా సదుపాయాలు లేకపోవడంతో నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

◆ ఇప్పటికైనా బల్దియా పాలకవర్గం ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకొని మరుగుదొడ్లు, మూత్రశాలల వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.



యువతుల స్ఫూర్తి.. చైతన్య దీప్తి

● పశువైద్యాధికారులుగా కొలువులు

ఆడపిల్ల గడప దాటకూడదు. అది గతం. ఆకాశమే హద్దు ఇది ప్రస్తుతం. రంగమేదైనా.. పోటీ ఎంతైనా.. అవకాశాలు అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారే అయినా కష్టపడి చదివారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించారు.. పశువైద్యులుగా ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో 18 మంది పశువైద్యాధికారులుగా బాధ్యతలు తీసుకోగా, అందులో పది మంది మహిళలు ఉన్నారు. వారి విజయగాథపై ప్రత్యేక కథనం. -న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం :

మూగజీవాల బాధ కదిలించింది..

-లావణ్య, ఆదిలాబాద్



ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కుచులాపూర్‌కు చెందిన లావణ్యది వ్యవసాయ కుటుంబం. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండేవారు. అయిదో తరగతిలో నవోదయకు ఎంపికయ్యారు. గతంలో వారికి డెయిరీ ఉండటంతో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల కొంత అవగాహన ఉంది. అప్పట్లో వాటికి చికిత్స చేసేందుకు వచ్చే వైద్యులు, వారి సేవలను గమనించిన లావణ్య పశు వైద్యాధికారి కావాలని అనుకున్నారు. ఆ దిశగా చదువుకొని కళాశాలలో సీటు పొందారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి పశువైద్యాధికారిగా ఎంపికయ్యారు. "చిన్నప్పుడు గ్రామంలో వందల సంఖ్యలో మూగజీవాలు ఉండేవి. వాటికి వచ్చే వ్యాధుల గురించి గ్రామస్థులకు అవగాహన లేక సకాలంలో చికిత్స చేయక కొన్ని చనిపోయేవి. వాటి బాధ నాలో ఆలోచన కలిగించింది. అందుకే పశువైద్యాధికారి కావాలని అనుకున్నాను. సాధించానంటున్నారు లావణ్య".

ఉన్నత స్థానానికి చేరుకోవాలని..

-అంజలి, కుమురం భీం



కుమురం భీం జిల్లా కౌటల మండలం ముత్యంపేట పశువైద్యశాలలో అంజలి పశువైద్యురాలిగా బాధ్యతలు తీసుకున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈమె పదో తరగతి వరకు మంచిర్యాలలో చదివారు. ఇంటర్ ప్రైవేట్ పాఠశాలలో చదివారు. తర్వాత ఎంట్రెన్స్ రాయడంతో బీవీఎస్సీలో సీటు రావడంతో హైదరాబాద్‌లో అయిదేళ్ల పాటు చదివారు. తర్వాత పీజీ చేసేందుకు కేరళకు వెళ్లారు. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో పీజీ మధ్యలో వదిలేసి సాధన చేసి మంచి మార్కులతో పాసై పశువైద్యురాలిగా ఎంపికయ్యారు. "ఉన్నత స్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో పట్టుదలతో చదవడంతోనే ఇది సాధ్యమైంది. మూగజీవాలంటే ఇష్టం. వాటికి సేవ చేయాలనే ఆశయంతో బీవీఎస్సీ కోర్సులో చేరాను. వాటికి వైద్యం అందించి కాపాడేందుకు ప్రయత్నిస్తానంటున్నారు అంజలి".

సేవతోనే సంతృప్తి..

-సంధ్యారాణి, మంచిర్యాల



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలానికి చెందిన సంధ్యారాణి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. పదో తరగతి వరకు కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివారు. తర్వాత ఇంటర్ పూర్తి చేసి ఎంట్రెన్స్ రాయడంతో బీవీఎస్సీలో సీటు వచ్చింది. అయిదేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న ఏడాదికి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ అయింది. పరీక్ష రాసి పాసై పశువైద్యాధికారిగా ఉద్యోగం వచ్చింది. 'నోరు లేని మూగజీవాలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. ఆడపిల్లలకు కష్టం అవుతుందని చాలా మంది చెప్పారు. అయినా గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యం అందించాలనే లక్ష్యంతో ఉద్యోగంలో చేరానంటున్నారు సంధ్యారాణి".

ఏడేళ్లు వేచి చూశా...

- ప్రియాంక, నిర్మల్



నిర్మల్ జిల్లా లక్ష్మణచాందకు చెందిన ప్రియాంక పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివారు. ఎక్కువ మార్కులు రావడంతో ఇంటర్ విద్యను ఉచితంగా ఓ కళాశాల అందించడంతో పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టి పెరగడంతో వ్యవసాయం, పశువులపై అవగాహన ఉండేది. కష్టపడి బీవీఎస్సీ (బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్) కోర్సులో చేరి పూర్తి చేశారు. ప్రభుత్వం పశువైద్యుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఒప్పంద పద్ధతిలో నిర్మల్ జిల్లాలో ఏడేళ్ల పాటు పని చేశారు. తర్వాత టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి పశువైద్యాధికారిగా ఎంపికయ్యారు. "మూగజీవాలపై ప్రేమతోనే ఈ వృత్తిని ఎంచుకున్నాను. బీవీఎస్సీ పూర్తి చేసుకున్న తర్వాత నోటిఫికేషన్ రాక ఏడేళ్లు పలు మండలాల్లో పని చేశాను. పశువులకు వచ్చే వ్యాధులు, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన ఉంది. ఇష్టంగా చేస్తే.. ఏ వృత్తి అయినా.. కష్టమేమి అనిపించదంటున్నారు

ఇన్‌స్పైర్‌లో మనోళ్ల జోరు!



● మంచిర్యాల రెండు, కుమురంభీం జిల్లాకు నాలుగో స్థానం
● ఉమ్మడి జిల్లాలో 3,533 రిజిస్ట్రేషన్లు

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

ఇన్‌స్పైర్ మనక్ 2024-25 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లలో మన విద్యార్థులు ఉత్సాహం కనబరిచారు. ఉమ్మడి జిల్లా నుంచి ఏకంగా 3,533 ప్రాజెక్టుల కోసం నామినేషన్లు నమోదయ్యాయి. 92.2 శాతంతో మంచిర్యాల రాష్ట్రంలో రెండో స్థానం, 88.1 శాతంతో కుమురం భీం జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. 2023-24లో నమోదైన ప్రాజెక్టుల్లో కుమురం భీం జిల్లా నుంచి 108 జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక కాగా వచ్చే నెలలో ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు.



జూన్‌లో ఇన్‌స్పైర్ మనక్ జాతీయ పోటీల్లో పాల్గొన్న అక్షర పటేల్

ఈసారి ప్రదర్శనలకు ఎంపికైన ప్రాజెక్టులు

ఆదిలాబాద్	నిర్మల్	కుమురంభీం	మంచిర్యాల
63	128	108	149

ఎంపిక ఇలా..

కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి మంత్రిత్వశాఖ ఏటా దేశ వ్యాప్తంగా నిర్వహించే ఇన్‌స్పైర్ (ఇన్నొవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రిసర్చ్) మనక్ (మిలియన్ మైండ్స్ అగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) విద్యార్థుల్లో సృజనకు పదును పెడుతోంది. నిత్యం జీవితంలో ఎదురయ్యే సమస్యలను వారు చూపించే పరిష్కారాల ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్లను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుల్లో అత్యుత్తమైన వాటిని జాతీయ పోటీలకు ఎంపిక చేస్తుంది. జాతీయ స్థాయిలో ఎంపికైన వాటిని జపాన్‌లో జరిగే అంతర్జాతీయ సకురా ప్రదర్శనలకు పంపుతారు.

జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో చదివే 6-10 తరగతుల విద్యార్థులు అర్హులు కాగా.. ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. అందులో నుంచి 10శాతం ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో ప్రాజెక్టు తయారీ ఖర్చుల కోసం రూ.10వేల చొప్పున జమచేస్తారు. గైడ్ టీచర్ సహాయంతో విద్యార్థులు దీన్ని సిద్ధం చేసి జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శిస్తారు. జిల్లా స్థాయి ప్రదర్శనల్లో 11 శాతం ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపించనున్నారు.

ఇదీ ప్రయోజనం

జాతీయ స్థాయిలో జ్యూరీని ఆకట్టుకుని ఎంపికయ్యే అత్యుత్తమ 60 ప్రాజెక్టుల విద్యార్థులను రాష్ట్రపతి స్థాయిలో గుర్తింపు లభిస్తుంది. ఈ విద్యార్థులకు రాష్ట్రపతి భవన్‌లో విందు ఏర్పాటు చేస్తారు. వీరి ప్రాజెక్టులకు పేటెంట్ హక్కును కల్పిస్తారు. వీరికి దేశంలో పేరున్న ఐఐటీల్లో ప్రవేశం లేక రిజర్వేషన్ కల్పిస్తారు.

జాతీయ స్థాయిలో మెరిసిన విద్యార్థులు

గతేడాది నవోదయ విద్యాలయానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని ముకుం అక్షర పటేల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. వరిగడ్డి కాల్చి వాయు కాలుష్యానికి కారణం కాకుండా ఆ గడ్డితో మొక్కలు పెంచే కుండీల తయారీ వినియోగించవచ్చని నిరూపించే ప్రాజెక్టుతో ఆకట్టుకుంది.

ఉమ్మడి జిల్లాలో నమోదైన ఇన్‌స్పైర్ నామినేషన్లు

	మంచిర్యాల	కుమురం భీం	నిర్మల్	ఆదిలాబాద్
నామినేషన్లు	1308	768	894	563
శాతం	92.2	88.1	71.6	37.3

● జిల్లా ● నామినేషన్లు ● శాతం

వచ్చే నెలలో ప్రదర్శనలు

కటుకం మధుకర్, జిల్లా సైన్సు అధికారి, కుమురంభీం

ఈ సారి జిల్లా నుంచి 768 ప్రాజెక్టులు నమోదవడం సంతోషకరం. వచ్చే నెల మూడో వారంలో జిల్లా స్థాయి ప్రదర్శన పోటీలు ఉంటాయి. ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు ఈ విషయంలో తగు శ్రద్ధ తీసుకోవాలి.

నేడు ఏనుగు పండగ

● మహారాష్ట్ర సరిహద్దులో కొనసాగుతున్న సంప్రదాయం

న్యూస్‌టుడే, బేల :

దీపావళికి ముందు వచ్చే అష్టమి రోజు ఆదిలాబాద్ జిల్లావాసులు ఏనుగును పూజిస్తారు. గజేంద్రున్ని దైవంగా భావించి తరాలుగా పూజిస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉండే బేల, జైనథ్, తాంసి మండలాల్లో ఈ ఆచారం కనిపిస్తుంది. ఆయా మండలాల్లోని మరాఠీ భాష మాట్లాడే ప్రజలు ఈ సంప్రదాయాన్ని తరాలుగా కొనసాగిస్తున్నారు. బహుళ అష్టమి నాడు ఏనుగు వ్రతం నిర్వహిస్తారు. మట్టితో ఏనుగు ప్రతిమలు తయారు చేస్తారు. గురువారం ఈ పండగను నిర్వహించనున్నారు.



మట్టితో తయారు చేసిన ఏనుగు విగ్రహం

ఎందుకు పూజిస్తారు..

ఈ పండగ వెనుక ఓ పౌరాణిక గాథ ఉందంటారు. ఒకసారి పార్వతీదేవి శివుడిపై అలిగి కైలాసం వదిలి వెళ్లిపోయిందట. కొన్ని రోజుల తర్వాత శివుడు ఏనుగు(గజేంద్రుడు)ను పంపి పార్వతీ దేవిని రమ్మని అన్నాడట. అప్పుడు పార్వతీ దేవి సంతోషంతో గజేంద్రుడిపై కూర్చొని తిరిగి శివుడి దగ్గరకు కైలాసానికి వచ్చిందట. ఈ అష్టమి నాడు ఏనుగును పూజిస్తే పార్వతీదేవి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఐశ్వర్యాలు, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతాయని భావిస్తారు. నియమ నిష్ఠలతో ఏనుగును పూజిస్తారు.

తాళసప్తమి వేడుకలు ప్రారంభం



సప్తమి వేడుకల్లో భజన చేస్తున్న భజనకారులు

కుభీరు: మండలంలోని పార్డి(కె) గ్రామ హనుమాన్ ఆలయంలో వారం రోజుల పాటు నిర్వహించే తాళసప్తమి వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆలయంలోని హనుమంతుడి ప్రతిమకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. భజనకారుల భజనల మధ్య సప్తమి వేడుకలు ప్రారంభించారు. గ్రామస్థులు వంతుల వారీగా సప్తమి వేడుకల్లో పాల్గొంటారు. ప్రతిరోజు రాత్రి ప్రముఖ మహారాజ్‌ల కీర్తన, రాత్రికి అన్నదానం, హరిపాఠ్ పారాయణం, కాగడా హారతి నిర్వహిస్తారు. ఈనెల 30న ముగింపు వేడుకలు గ్రామంలో శోభాయాత్ర, ఉట్టిపగులగొట్టే కార్యక్రమం, మహాప్రసాదం ఉంటుందని ఆలయకమిటీ అధ్యక్షుడు బందెల శంకర్ తెలిపారు. మాజీ సర్పంచి ఆకుల గంగాధర్, ఆలయకమిటీ ప్రతినిధులు గంటా రాములు, లంక పోశెట్టి, మరాఠి బాబు, ఆకుల వెంకటి, గోజల గజ్జారాం, లంక సురేశ్, భజనకారులు పాల్గొన్నారు.

ఆలోచన అదిరే.. చిత్రాలతో మెరిపించే

● అధునాతన యంత్ర సహకారం.. అబ్బురపర్చే పనితనం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే:

చేసే పనిలో నిబద్ధత.. కొత్తదనం కోసం ప్రయత్నిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అలా వినూత్న పంథాలో వెళ్లి సరికొత్త రూపంలో చిత్రాలు వేస్తూ అబ్బురపరుస్తున్నారు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పోతుల శ్రీనివాస్. ఎంబ్రాయిడరీలో రంగురంగుల దారాలతో ఆధునిక యంత్రంపై వీటిని తీర్చిదిద్దుతున్నారు. ఒక్కో చిత్రానికి గంటల సమయం పడుతున్నా తనలోని కళాత్మక ధోరణితో వాటిని తయారు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ప్రముఖుల చిత్రాలు రూపొందించి వాటిని వారికి అందజేసి ప్రశంసలు సైతం అందుకున్నారు.

ఉపాధి నిమిత్తం

ఖమ్మం జిల్లా వైరాకు చెందిన పోతుల శ్రీనివాస్ టైలరింగ్ వృత్తిలో ఉపాధి నిమిత్తం 20 ఏళ్ల క్రితం నిర్మల్ పట్టణానికి వచ్చారు. భార్య అనిత ఈయనకు తోడ్పాటుగా నిలిచారు. కాలానికి అనుగుణంగా తమ వృత్తిలోనూ మార్పులు అందిపుచ్చుకుంటూ ఎంబ్రాయిడరీ చేసే చిన్న యంత్రాన్ని కొనుగోలు చేశారు. దానిపై జాకెట్లకు వివిధ ఆకృతుల్లో ఎంబ్రాయిడరీ చేసేవారు. రెండేళ్ల క్రితం సరికొత్తగా వచ్చిన మరో మిషన్ కొన్నారు. దానిపై ఎంబ్రాయిడరీతోపాటు చిత్రాలు వేయొచ్చు. ఆ పనిపై అవగాహన, శిక్షణ పొంది ఏడాది క్రితం ఫొటోలు వేయడం ప్రారంభించారు.

ఒక్కో చిత్రానికి 16-18 గంటలు

నాణ్యమైన పట్టు వస్త్రాలపై చిత్రాలను వేస్తున్నారు. ఒక్కటి తయారు కావాలంటే సుమారు 16-18 గంటల సమయం పడుతుంది. ఇందుకు ఎంతో శ్రమిస్తున్నారు. ఏ మాత్రం అశ్రద్ధగా ఉన్నా శ్రమ వృథా అయ్యే ప్రమాదం ఉంటుందని శ్రీనివాస్ చెబుతున్నారు. అందుకే దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తూ వాటిని తయారు చేస్తున్నారు. భార్యతోపాటు కుమారులు డిగ్రీ పూర్తి చేసిన కార్తిక్, మాధ్యమిక విద్యనభ్యసిస్తున్న అఖిల్ సాయం చేస్తున్నారు. ఏడాది కాలంలో ఇప్పటి వరకు సుమారు 105 చిత్రాలు వేశారు.



యంత్రం వేస్తున్న చిత్రాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్న శ్రీనివాస్

ప్రముఖుల ప్రశంసలు..

సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ, తెలంగాణ ఉప ముఖ్యమంత్రులు భట్టి విక్రమార్క, పవన్‌కల్యాణ్, మంత్రి సీతక్క, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాస్ ఇలా ఎందరివో చిత్రాలు వేశారు. ఆయనలోని కళను గుర్తించి ఇప్పటికే ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. నాణ్యమైన సిల్క్‌పై చిత్రం వేయడంతో శాశ్వతంగా ఉంటాయని శ్రీనివాస్ చెబుతున్నారు. త్వరలో ప్రదర్శన ఏర్పాటు చేసే ఆలోచన ఉందని పేర్కొన్నారు. ఒక చిత్రం వేసే సమయంలో అనేక జాకెట్లకు ఎంబ్రాయిడరీ చేసి డబ్బు సంపాదించవచ్చని, కానీ ఈ కళపై ఆసక్తితో పలు గంటలు శ్రమిస్తున్నానని, తన పనికి లభిస్తున్న ప్రశంసలే తనకు ఇంధనమవుతోందని చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం



తల్లితో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటం

పాఠశాలలకు పాలు సరఫరా చేయాలి: పీవో

నిర్మల్, న్యూస్‌టుడే: ఐటీడీఏ నిర్వహిస్తున్న పాఠశాలలకు పాలు సరఫరా చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా డెయిరీ నిర్వాహకులను కోరారు. బుధవారం నిర్మల్‌లోని విజయ పాల కేంద్రాన్ని సందర్శించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ సహకారంతో తెలంగాణలోని సహకార రంగంలో పర్యావరణహితంగా ఏర్పాటుచేసిన లవణ కర్మాగారం, పాల ప్యాకింగ్ యూనిట్లను పరిశీలించారు. గిరి విజయమిన్ ప్లాంటు నిర్వహిస్తున్న బృంద సభ్యులు చందు, మానసలను లవణ మిశ్రమ తయారీ, అమ్మకాలను అడిగి తెలుసుకున్నారు. విజయ పాల ప్యాకింగ్ ప్లాంటును సందర్శించి ఐటీడీఏ ద్వారా నలుగురు గిరిజన యువతకు నియామక పత్రాలు అందజేసి ఉపాధి కల్పించారు. రోజూ వారీ పాల సేకరణ, ప్యాకింగ్ సమాచారం, రైతులకు అందజేస్తున్న దాణా, లవణ మిశ్రమం, గడ్డి విత్తనాలను పరిశీలించారు. త్వరలో కాగజ్‌నగర్‌లో బల్క్ కూలింగ్ యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. అనంతరం జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోఫీనగర్‌లోని పెట్రోల్ బంక్‌ను సందర్శించారు. జేడీఎం నాగభూషణం, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ బాలిక్ అహ్మద్, జీసీసీ డీఎం రామానందం, విజయ డెయిరీ డీడీ మధుసూదన్, మేనేజర్ దస్రునాయక్, గజ్జారాం, సంతోష్, కాంతారావ్, పంపిణీదారులు రమణారెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



లవణ మిశ్రమ ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

విద్యార్థి నాయకురాళ్లు!

● బోథ్ గురుకులంలో నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక తర్ఫీదు

న్యూస్‌టుడే, బోథ్ :

విద్యార్థినులు నాయకురాళ్లుగా మారుతున్నారు. ఇదేమిటని ఆలోచిస్తున్నారా? అక్షరాల నిజం. సాధారణంగా గురుకుల విద్యార్థులు చదువులో, ఆటల్లో రాణించడం చూస్తుంటాం. విద్యతో పాటు విభిన్న రంగాల్లో రాణించేలా నైపుణ్యాలు పెంపొందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తున్నారు ఆ పాఠశాల ఉపాధ్యాయులు.

బోథ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో వినూత్న విధానాలను పాటిస్తూ భావిభారత పౌరుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. విద్యార్థి దశలోనే వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నారు. ఈ గురుకులంలో 634 మంది విద్యనభ్యసిస్తున్నారు. చాలా మంది గ్రామీణ ప్రాంత నిరుపేదలే. వారిలో నాయకత్వ లక్షణాలను గుర్తించారు పాఠశాల ఉపాధ్యాయులు. గురుకులంలో చురుగ్గా ఉన్న విద్యార్థినులలో నాయకత్వ లక్షణాలను గుర్తించి వారిని ఓ కమిటీగా ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు పాఠశాలలోని భోజన సదుపాయాలను, విద్యార్థినుల సమస్యలను, కిచెన్‌గార్డెన్, పాఠశాల స్వచ్ఛతలను పర్యవేక్షిస్తారు. వీటితో పాటు ఉదయం సమయంలో విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఓ రెండు నిమిషాలు విద్యార్థిని ఓ విషయంపై భయం లేకుండా అనర్గళంగా మాట్లాడేలా శిక్షణ అందిస్తున్నారు. పాఠశాలలోని విద్యార్థి నాయకులు ఇతర పిల్లలు చదువు, వైద్యం, సమయపాలన, వ్యక్తిగత శుభ్రత, ఆటపాటల్లో రాణించేలా శిక్షణనిస్తున్నారు. ఉపాధ్యాయులు తరగతి గదికి గైర్హాజరైన సమయంలో విద్యార్థి నాయకులు ఆ సమయాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఉపాధ్యాయులుగా మారి తరగతి గదిలో తోటి విద్యార్థులు పలు విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. గురుకులంలో ఈ ప్రత్యేక కార్యాచరణ విద్యార్థినుల్లో మార్పు తీసుకొచ్చిందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



బోథ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తోటి విద్యార్థులతో మాట్లాడుతున్న బృంద నాయకురాలు

చదువుతో పాటు నాయకత్వం

- హాసిని



మా గురుకులంలో తోటి విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి బృంద నాయకురాలిగా కృషి చేస్తున్నాను. నేను చదువుకుంటూనే ఉదయం, సాయంత్రం వేళల్లో మిగతా విద్యార్థులకు సహాయం చేస్తున్నాను. విద్యార్థినులతో కలిసి పోయి ఉపాధ్యాయులకు, విద్యార్థినులకు వారధిగా నిలుస్తున్నాను. వెనుకబడిన పాఠ్యాంశాల్లో మెరుగైన మార్కులు సాధించేలా కృషి చేస్తున్నాను. విద్యార్థినులు అనారోగ్యం బారిన పడితే వైద్య సిబ్బంది దగ్గరికి తీసుకువెళతాను.

ఆటలు, సాంస్కృతిక పోటీల్లో రాణించేలా

- జి.రుతుమన్న



గురుకులంలో ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆసక్తి గల విద్యార్థినులను గుర్తించి ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాం. సెలవు దినాలలో విద్యార్థినులకు నృత్యాలు నేర్పిస్తున్నాం. పలు ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యార్థినులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణిస్తున్నారు. చదువులో సైతం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, వారి అనుమానాలను నివృత్తి చేస్తున్నా.

సమష్టి కృషితో ముందుకు..

- సంగీత, ప్రిన్సిపల్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బోథ్

పాఠశాలలో సమష్టి కృషితో ముందుకు వెళుతున్నాం. విద్యార్థినులను ఆదర్శ నాయకులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కమిటీని ఏర్పాటు చేసి వారికి పలు బాధ్యతలను అప్పగించాం. టీం లీడర్లు పాఠశాలలోని బాలికలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. పాఠశాలలోని సమస్యలను సైతం మా దృష్టికి తీసుకొస్తుండటంతో పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఈ విధానం సత్ఫలితాలనిస్తోంది.

28న జిల్లాకు బీసీ కమిషన్ బృందం రాక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఈ నెల 28న బీసీ కమిషన్ బృందం ఆదిలాబాద్ జిల్లాకు రానుందని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు కమిషన్ ఛైర్మన్ నిరంజన్ నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌తో పాటు నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల కుల సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. రాతపూర్వకంగా అభ్యర్థనలు నిర్ణీత నమూనాలో తగు సమాచారంతో సమర్పించవచ్చని పేర్కొన్నారు. కమిషన్ సభ్యులు బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించగా.. పాలనాధికారితో పాటు అదనపు పాలనాధికారి శ్యామలదేవి, బీసీ సంక్షేమాధికారి రాజలింగు పాల్గొన్నారు.

వైద్యుల నియామకానికి 29న ముఖాముఖి

ఆదిలాబాద్ వైద్య విభాగం: ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్)లోని వివిధ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీఎంఓ/సీఏఎస్ పోస్టులను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ నిజ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులతో వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. నియామకాలను మెరిట్, ఆర్ఓఆర్ నిబంధనల మేరకు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూలు ఈ నెల 29న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగుతాయన్నారు. ఆయా విభాగాల్లో భర్తీ చేయనున్న వైద్యుల వివరాల కోసం adilabad.telangana.gov.in లేదా rimsadil-abad.org వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించారు. వివరాల కోసం 98480 57606 నెంబరును సంప్రదించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ కరకట్టపై వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. రాత్రివేళ తాగుబోతులుకు అడ్డాగా మారుతుంది. **-రాజేష్, అంబేడ్కర్‌నగర్**

✔ మినీట్యాంక్‌బండ్‌పై వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. మద్యం తాగితే జరిమానాలు విధించాలని పోలీసులను కోరతాం. **-శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్**

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే:

? మండలంలోని దుగ్నెపల్లికి వెళ్లేదారిలో నక్కచెరువు అలుగు వద్ద రహదారిపై గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- తిరుపతి, దుగ్నెపల్లి**

✔ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తాం. **- అజ్మత్‌అలీ, ఎంపీవో, చెన్నూరు**

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం లక్షెట్టిపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన తుమ్మ రాజన్న(44) అనే రైతు బుధవారం ఉదయం ఎప్పటిలా గ్రామ శివారులోని తన పొలానికి నీరు అందించడానికి వెళ్లారు. రాత్రి అయినా ఇంటికి తిరిగిరాకపోవడంతోపాటు చరవాణి రింగ్ అవుతున్నా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తెలిసిన వారికి చెప్పి వెళ్లి చూడమన్నారు. వారు అక్కడికి వెళ్లి చూడగా ఆయన విద్యుదాఘాతంతో ఛాతి భాగం కాలి మృతి చెంది కనిపించారు. రాజన్న 15 సంవత్సరాలుగా దుబాయిలో పని చేయగా ఆరు నెలల క్రితమే వచ్చాడు. కొత్తగా ఇళ్లు కట్టుకుని ఈ మధ్య గృహ ప్రవేశం చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్టు గ్రామస్థులు తెలిపారు.



రాజన్న

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హాజీపూర్, న్యూస్‌టుడే: మండలంలోని వేంపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మద్దిరాలకు చెందిన మాటేటి శంకర్(39), వెల్గటూర్ మండలం చెగ్యాంకు చెందిన నడిమెట్ల పోచయ్యలు ద్విచక్రవాహనంపై మంచిర్యాలకు పని మీద వచ్చారు. తిరుగు ప్రయాణంలో అంతర్గాంకు వెళ్తుండగా వేంపల్లి వద్ద మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపునకు వెళ్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీకొంది. క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మాటేటి శంకర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నడిమెట్ల పోచయ్య పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న హాజీపూర్ పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలపై ఆరా తీస్తున్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

నస్పూర్, న్యూస్‌టుడే: ఊరెళ్లిన భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి క్షణికావేశంలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పురపాలికలోని అల్లూరి సీతారామరాజు నగర్‌కు చెందిన బుద్దె రాజు(45) టైలరింగ్ చేస్తూ జీవనం సాగించాడు. భార్య రెండు సంవత్సరాల క్రితం పుట్టింటికి పోయింది. కాపురానికి రావాలని పలు మార్లు చెప్పినా రాలేదు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సుగుణాకర్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూట్యూబర్‌పై కేసు నమోదు

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సామాజిక మధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసిన చిలుక ప్రవీణ్‌కుమార్ అనే యూట్యూబర్‌పై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అక్టోబరు 15న బట్వాన్‌పల్లికి చెందిన నరేందర్, మల్లేశంకు భూవివాదంలో గొడవ జరిగి పరస్పరం దాడి చేసుకోవడంతో తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను నరేందర్ సామాజిక మధ్యమాల్లో పోస్ట్ చేశారు. దీన్ని ఆధారంగా చేసుకొని చిలుక ప్రవీణ్‌కుమార్ భారాసకు ఓటు వేసినందుకు కాంగ్రెస్ కార్యకర్తలు గొడ్డలితో దాడి చేసినట్లు తప్పుడు ప్రచారాన్ని సామాజిక మధ్యమాల్లో ప్రచారం చేసినట్లు తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌పై తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

దాడి చేసిన వ్యక్తులపై..

నెన్నెల, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్‌కు చెందిన ఆజ్మీర రాజేష్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులపై దాడి చేసిన నెన్నెల మండలంలోని శ్రవణపల్లికి చెందిన బూక్య చంద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం చంద్‌కు శ్రీరాంపూర్‌కు చెందిన రాజేష్ చెల్లి సునీతతో వివాహం జరిగింది. రెండు రోజుల కిందట సునీత భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న సునీత తల్లిదండ్రులతోపాటు రాజేష్ శ్రవణపల్లికి వచ్చారు. రాజేష్ వారితో గొడవపడి కర్రతో దాడి చేసినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గల్ఫ్ అసోసియేషన్ సభ్యుల ఉదారత

జన్నారం, న్యూస్‌టుడే : చింతగూడ గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు ఉదారత చాటుకున్నారు. గ్రామానికి చెందిన సంపంగి రాయమల్లు(36) ఇటీవల ఇరాక్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు రూ.73వేల నగదును రాయమల్లు తండ్రి సంపంగి మల్లయ్యకు బుధవారం అందజేశారు.



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సభ్యులు

జాతీయస్థాయి పోటీల్లో సత్తా

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మైనార్టీ సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. హరియాణాలో నిర్వహించిన 9వ జూనియర్ జాతీయ సాఫ్ట్‌బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటి మూడో స్థానంలో నిలిచారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్, ఫుట్‌బాల్, లాంగ్‌టెన్నిస్, క్రికెట్ అండర్-17, 19 పోటీల్లో 12 మంది విద్యార్థులు విజయం సాధించారు. వీరిని ప్రిన్సిపల్ ఎండీ.నీలు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఎండీ.నీలు

బాక్సింగ్ క్రీడాకారిణికి సత్కారం

మంచిర్యాల క్రీడావిభాగం: బాక్సింగ్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న జిల్లా క్రీడాకారిణి, స్థానిక ఖేలో ఇండియా కేంద్రంలో శిక్షణ పొందుతున్న కీర్తి అగర్వాల్‌ను ఫిట్‌నెస్ సెంటర్ సభ్యులు సత్కరించారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెతోపాటు శిక్షకుడు రాజేష్‌ను సన్మానించారు.

సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక

మంచిర్యాల విద్యావిభాగం, మంచిర్యాల క్రీడావిభాగం: కాకతీయ యూనివర్సిటీ సౌత్‌జోన్ పోటీలకు మిమ్స్ డిగ్రీ కళాశాలకు చెందిన డానియల్, కమల్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. హనుమకొండలో నిర్వహించిన అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటారన్నారు.

పరీక్ష రాసి.. ప్రతిభ చాటి..



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు



విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న పాఠశాల నిర్వాహకులు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతిభా పోటీలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా కేంద్రంలోని డా.రాధాకృష్ణన్ హైస్కూల్ కరస్పాండెంట్ కె.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అంతర్జాల వినియోగంపై లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ అనుభవాలను వ్యాసం రూపంలో పంచుకున్నారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారిని ఎంపికచేయగా ప్రథమ స్థానంలో జి.లాస్య(10వ), ద్వితీయ స్థానంలో బి.హర్షణ(9వ), తృతీయ స్థానంలో పి.నిఖిత(8వ) నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు కె.సురేఖలు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

స్తంభాలు సరి చేసి.. తీగలు బిగించి..

దండేపల్లి, న్యూస్‌టుడే: పొలం బాట కార్యక్రమంలో భాగంగా ట్రాన్స్‌కో సిబ్బంది బుధవారం దండేపల్లి శివారులోని పలు పొలాల్లో పర్యటించారు. ఒరిగిన స్తంభాలు, వదులుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగలను గుర్తించి సరి చేశారు. ట్రాన్స్‌కో ఏఈ బాపు , సబ్ ఇంజినీర్ సాయి కృష్ణ, ఎల్ఐ లక్ష్మణ్, లైన్‌మెన్ నెల్కి మల్లేశ్, జూనియర్ లైన్‌మెన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

మంచిర్యాల సిటీ: జిల్లా ఉపాధి, శిక్షణశాఖ ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయా శాఖ జిల్లా అధికారి ముప్పిడి రజిని కిరణ్ బుధవారం తెలిపారు. స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డీ-ఫార్మసీ, బీ-ఫార్మసీ ఉన్నవారు అర్హులన్నారు.

ఆరోగ్య సమాచారం రిజిస్టర్‌లో నమోదు చేయాలి

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లాలో ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశా కార్యకర్తలు అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల వివరాలను రిజిస్టర్‌లలో నమోదు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖాధికారి డా.హరీష్‌రాజ్ ఆధ్వర్యంలో సంబంధిత రిజిస్టర్‌లను పలువురు ఆశా కార్యకర్తలకు పంపిణీ చేశారు. జిల్లాలో ఉన్న 651 మంది ఆశాలకు 3,515 రిజిస్టర్‌లను అందించనున్నట్లు తెలిపారు. రిజిస్టర్‌లోని 17 రకాల వైద్య సేవల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.



ఆశా కార్యకర్తలకు రిజిస్టర్‌లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

క్రీడలతో మానసిక ఉల్లాసం

లక్షెట్టిపేట: క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్ అన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపులే బీసీ బాలుర గురుకులంలో 27వ తేదీ వరకు నిర్వహించనున్న జిల్లాస్థాయి క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బి.వినోద్ కుమార్, ప్రిన్సిపాళ్లు, పీడీలు, క్రీడా నిర్వాహకులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిగా రామ్మోహన్‌రెడ్డి

మంచిర్యాల న్యాయవిభాగం, న్యూస్‌టుడే: మంచిర్యాల ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా రామ్మోహన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు నుంచి పదోన్నతిపై ఆయన మంచిర్యాలకు వచ్చారు. బార్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. న్యాయవాదులందరూ కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలని కోరారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి డా.సంపత్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, ఉపాధ్యక్షుడు గంగయ్య, న్యాయవాదులు రవీందర్‌రావు, కర్రె లచ్చన్న, రాజేశ్‌గౌడ్, కమల మనోహర్‌రావు, శైలజ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆయుధాలపై అవగాహన

బెల్లంపల్లి పట్టణం, తాండూరు, కాసిపేట , నెన్నెల(కన్నెపల్లి), రామకృష్ణాపూర్, భీమిని, మందమర్రి పట్టణం న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా చట్టాలతోపాటు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయుధాల వినియోగం, రిజిస్టర్లు, అందిస్తున్న సేవలు, నిందితులను ఉంచే సెల్‌లు తదితర వివరాలను పలు పాఠశాలల విద్యార్థులకు వివరించారు. బెల్లంపల్లి పట్టణంలోని గ్రామీణ సర్కిల్ కార్యాలయంలో కృష్ణవేణి పాఠశాల విద్యార్థులకు, తాండూరు మండలం మాదారం, కాసిపేట, రామకృష్ణాపూర్, మందమర్రి పోలీస్‌స్టేషన్‌లలో వేర్వేరుగా ఓపెన్‌హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు సిబ్బంది తిరుపతి, లవన్‌కుమార్, అశోక్, ప్రేమ్‌చంద్, ఎస్ఐల సౌజన్య, ప్రవీణ్, గంగారం, రాజశేఖర్, విజయ్ కుమార్, ఏఎస్ఐ తిరుపతిలు విద్యార్థులకు అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారు.



బెల్లంపల్లి : ఏకే 47 గురించి వివరిస్తున్న పోలీసు

పోలీసుల రక్తదానం

హాజీపూర్: ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు అవసరమైన రక్తం దానం చేయడంలో యువత భాగస్వాములు కావాలని టీజీఎస్పీ పటాలం కమాండెంట్ వెంకటరాములు అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం పటాలంలో పోలీసులు రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అసిస్టెంట్ కమాండెంట్ కాళీదాస్, మెడికల్ ఆఫీసర్ డా.సంతోష్‌సింగ్ పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలకు ఆహ్వానం

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: జాతీయ విద్యావిధానం-2020 నాలుగో వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సంబంధించి 6 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. నవంబరు 30లోగా https:///schoolinnovation-marathon.org లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.



శ్రీరాంపూర్‌లోని జీఎం కార్యాలయంలోని గదులు ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

నస్పూర్, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఆధునీకరించిన గదులను ప్రారంభించారు. ఎస్ఓటు జీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

నస్పూర్, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ ఏరియా హెచ్ఎంఎస్ నూతన కమిటీని బుధవారం ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. శ్రీరాంపూర్ ఏరియా జాయింట్ సెక్రెటరీ రాజేంద్రప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొడ్డు సురేందర్, ఆర్కే-7 పిట్ సెక్రెటరీ శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు.



నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి రక్షణ విభాగం ఐఎన్‌టీయూసీ నూతన పిట్ కమిటీని ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్ రావు ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. పిట్ కార్యదర్శి సాంబయ్య, సహాయ కార్యదర్శి పోలం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు చక్రధర్ తదితరులను ఎన్నుకున్నారు.

ఖాదీ మేళాను వినియోగించుకోండి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : మందమర్రి సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ మేళాను ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఈ మేళాను సింగరేణి కార్మిక కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీపావళి పండగ నేపథ్యంలో ఈ నెల 29 వరకు ఈ మేళా ఉంటుందన్నారు. సంస్థ అనుమతితో ఉద్యోగులకు వస్త్రాల కొనుగోలుకు రూ.20 వేల వరకు అయిదు వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు.

పారదర్శకంగా కౌన్సెలింగ్

నస్పూర్, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ ఏరియాలో ఖాళీగా ఉన్న క్వార్టర్ల కోసం ఉద్యోగులకు కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించామని ఎస్ఓటు జీఎం సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్‌లో ఖాళీగా 290 క్వార్టర్లకు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 107 మంది ఉద్యోగులు క్వార్టర్లు మార్పిడి చేసుకున్నారు.

ఖాళీల భర్తీకి..

నస్పూర్, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ ఏరియాలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ 10 ఖాళీ పోస్టుల భర్తీకి ఎస్ఓటు జీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనారోగ్య కారణాలు ఉన్న వారికి మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహించారు. 145 మందికి 88 మంది పాల్గొనగా వారి మెడికల్ రిపోర్టులు పరిశీలించారు. డీజీఎం(ప) అరవింద్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌సాగర్‌రావుపై ఆరోపణలు సరికాదు

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: భూకబ్జాలు, అక్రమ దందాలకు పాల్పడిన వారిపై గతంలో నమోదైన కేసుల్లో చట్టం తన పని తాను చేసుకుపోతుందని కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చల్ల నాగభూషణం అన్నారు. భారాస, భాజపా నాయకులు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. స్థానిక విశ్రాంతి భవనంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా తమ ప్రభుత్వం ఉపేక్షించే సమస్యే లేదని స్పష్టం చేశారు. నాయకులు గడ్డం త్రిమూర్తి, చింత అశోక్ కుమార్, పింగిలి రమేష్, మహ్మద్ ఆరిఫ్, బియ్యాల తిరుపతి, రాందేని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా రేషన్ దుకాణాల నిర్వహణ

ఏసీసీ, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ దుకాణాల నిర్వహణను పక్కాగా కొనసాగించాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాల అధికారులు, రేషన్ డీలర్ సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. లబ్ధిదారులకు సకాలంలో బియ్యం పంపిణీ చేపట్టాలని, దుకాణంలో లభించే సరకుల వివరాలు, నిల్వల వివరాలు నోటీస్ బోర్డుపై ఉంచాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమ పరిధిలో దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. పౌరసరఫరాలశాఖాధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఏఎస్‌వో వేణు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

భారీ వాహనాలను అనుమతించాలని వినతి

జన్నారం, న్యూస్‌టుడే : కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో భారీ వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బుధవారం ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అటవీశాఖ ముఖ్య ప్రధాన సంరక్షణ అధికారి (పీసీసీఎఫ్)ఆర్ఎం డోబ్రియల్‌ని హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం ఇచ్చారు. పులుల సంరక్షణ కేంద్రంలో ఉన్న పలు సమస్యలను అధికారి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రభాస్ పుట్టిన రోజు పురస్కరించుకుని అన్నదానం

ఏసీసీ, న్యూస్‌టుడే: ప్రభాస్ పుట్టిన రోజును పురస్కరించుకొని జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బుధవారం అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ రజాక్ సమక్షంలో స్థానిక ఐబీ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో కేక్‌కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి అసోసియేషన్ సభ్యులు రక్తదానం చేశారు. సురేష్, శ్రీకాంత్, అశ్విన్, నరేష్, శివ, శ్రీను, ప్రశాంత్, శ్రీధర్, నబియాస్, కోటేష్, మోహన్, గౌస్, అజయ్ పాల్గొన్నారు.

సరిహద్దుల్లో ముమ్మర తనఖీలు

వేమనపల్లి: వేమనపల్లికి సమీపంలోని ప్రాణహిత నది తీరం వెంట బుధవారం ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గడ్చిరోలి జిల్లాలో ఇటీవల ఎదురుకాల్పులు చోటు చేసుకోవడంతో పలువురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగడంతో అక్కడివారు నదీతీరం వెంట వచ్చే అవకాశాలుండటంతో సరిహద్దుల్లో నిఘా పెంచారు.

కస్తూర్బా విద్యార్థినులకు చేయూత

కాసిపేట: మండలంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు 186 ప్లేట్లు, గ్లాసులను కల్వరీ మినిస్ట్రీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సిస్టర్ షారోన్ పుట్టినరోజు సందర్భంగా అందించినట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రాంచందర్, రౌతు సత్తయ్య, తహసీల్దార్ భోజన్న, మహేష్, రవి, తిరుపతి, గోపాల్ పాల్గొన్నారు.

భాజపాపై ఆరోపణలు అవాస్తవం

దండేపల్లి: కాంగ్రెస్ నాయకులు భాజపా జిల్లా అధ్యక్షుడు రఘునాథరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని, ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదని భాజపా మండలశాఖ అధ్యక్షుడు గోపతి రాజయ్య పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాకేశ్, నాయకులు శ్రీనివాస్, రవిగౌడ్, దివ్య, రాకేశ్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రవీందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మాదిగలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

నస్పూర్: సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేవెళ్లలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎస్సీ డిక్లరేషన్ తోపాటు ఇతర హామీలను అమలు చేయాలని పేర్కొన్నారు.

మందమర్రి పట్టణం: మందమర్రిలో తోళ్ల పరిశ్రమకు నిధులు కేటాయించి తెరిపించేందుకు చర్యలు చేపట్టాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. బుధవారం తోళ్ల పరిశ్రమను పరిశీలించి వివరాలు సేకరించారు. ఎమ్మెల్యే వివేక్ కల్పించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి ప్రత్యేకంగా నిధులు రాబట్టి ఉత్పత్తి ప్రారంభించేలా చూడాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతికి సన్మానం

జన్నారం: మండల కేంద్రంలోని వినాయక్‌నగర్ కాలనీకి చెందిన చిటికేసి సౌమ్యను కాలనీవాసులు బుధవారం సన్మానించారు. చిటికేసి వసంత-లచ్చన్న దంపతుల కూతురు సౌమ్య పోలీస్ ఉద్యోగం సాధించి శిక్షణలో ఉండగానే టీచర్ ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల కాలనీవాసులంతా కలిసి సౌమ్యను అభినందించారు.

27న జన్నారానికి మందకృష్ణ మాదిగ

బెల్లంపల్లి పట్టణం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 27న జన్నారానికి రానున్నట్లు మండల ఇన్‌ఛార్జి ఆయిల్ల గణేష్ తెలిపారు. బుధవారం రేచినిలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో మాట్లాడారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి

మందమర్రి పట్టణం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. మందమర్రిలో బుధవారం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు టి. ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

పంచసూత్రాలు పాటించాలి

జైపూర్: మహిళ స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పంచసూత్రాలను తప్పనిసరిగా పాటించాలని డీఆర్‌డీవో పీడీ కిషన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం రాజ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు.

వరి పంట పరిశీలన

తాండూరు: మండలంలోని అన్నారం గ్రామంలో వరి, పత్తి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి కల్పన పరిశీలించారు. వరిలో ఎండాకు తెగులు, కంకి నల్లీ ఉద్ధృతి ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు.